రామప్ప చెరువు కట్టపై యోగా చేస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్

పురాతన కట్టడాలపై వలంటీర్లకు అవగాహన

వెంకటాపూర్, అక్టోబర్3: మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప చెరువు వద్ద గల హరిత హోటల్‌లో మంగళవారం వరల్డ్ హెరిటేజ్ వలంటీర్లకు పురాతన కట్టడాలపై అవగాహన కల్పించారు. ముందుగా వారికి రామప్ప చెరువు కట్టపైన పాత గెస్ట్‌హౌస్ ఆవరణలో యోగాలో శిక్షణ ఇచ్చారు. అనంతరం పురాతన కట్టడాలకు వాడిన మెటీరియల్‌పై ప్రొఫెసర్ దేవప్రతాప్ వివరించగా, జియో ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీపై ప్రొఫెసర్ పాండురంగారావు వీసీలో వివరణ ఇచ్చారు. ఆ తర్వాత వలంటీర్లు రామప్ప ఆలయాన్ని సందర్శించి రామలింగేశ్వరుడికి పూజలు చేయగా, అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను, శిల్పకళా ప్రాముఖ్యతను టూరిజం గైడ్స్ ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రావు, కాకతీయ యూనివర్సిటీ స్కాలర్ కొక్కుల ప్రశాంత్, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, టూరిజం, కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, అక్టోబర్ 3: భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు హౌస్‌వైరింగ్‌లో 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ బాస రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయో పరిమితి 18 నుంచి 45 సంవత్సరాలు ఉండి, తెలుగులో రాయడం, చదవడం వచ్చి ఉండాలి. తెలుపు రేషన్‌కార్డు ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు 4 పాస్ ఫోర్ట్ సైజు ఫొటోలు, రేషన్, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలు తీసుకొని ఎస్‌బీఐ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, సంస్కృతి విహార్, టీటీడీసీ హసన్‌పర్తి, హనుమకొండలో 15-10-2023 లోగా పేర్లు నమోదు చేసుకోవాలి. శిక్షణ కార్యక్రమం 16-10-23 నుంచి ప్రారంభమవుతుంది. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సదుపాయం కల్పిస్తారు. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ కూడా ఉచితంగా ఇస్తారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు స్కిల్ ఇండియా సర్టిఫికెట్, శిక్షణకు సంబంధించిన టూల్ కిట్స్ ఇస్తారు. మరిన్ని వివరాలకు 9704056522, 8919031639, 9949108934 నంబర్ల లో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు పరీక్షల నియంత్రణ అధికారి నరేందర్

ఎల్ ఎల్ బీ పరీక్షల్లో ముగ్గురు మాల్‌ప్రాక్టీస్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 3: కాకతీయ విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ పరీక్షల్లో ముగ్గురిని మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ సీహెచ్ రాధిక తెలిపారు. ఖమ్మంలోని పరీక్ష కేంద్రాన్ని అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ నరేందర్ సందర్శించి ముగ్గురు విద్యార్థులను మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేశారు. వీరిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు 13 వరకు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 3: వరంగల్ ఉమ్మడి జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ విధానంలో 2023-24 సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 13వ తేదీ వరకు అపరాధ రుసుముతో అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎండీ అబ్దుల్ హై, ఓపెన్ స్కూల్ వరంగల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలు తీసుకోవాలనుకునే అభ్యర్థులు అధ్యయన కేంద్రాల కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని, దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఫీజుతో పాటు ఆన్‌లైన్ చేసినందుకు నామమాత్రపు రుసుమునే చెల్లించాలని, ఫీజులను మీ సేవ/టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలన్నారు. ఈ విషయాలను ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, ఉపాధ్యాయ సిబ్బంది విస్తృత ప్రచారం చేసి అధికసంఖ్యలో అభ్యాసకులు అడ్మిషన్లు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిగతా వివరాలకు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో చూడవచ్చని వారు తెలిపారు.

ఉక్కు ఫ్యాక్టరీకి ఉరి

- బయ్యారం స్టీల్ ప్లాంట్‌పై నోరు మెదపని ప్రధాని మోదీ
- విభజన హామీని నెరవేర్చడంలో కేంద్రప్రభుత్వం విఫలం
- పరిశ్రమ కోసం తొమ్మిదేళ్లుగా నిరీక్షణ
- కేంద్రం తీరుపై తెలంగాణ ప్రజల మండిపాటు
- ప్రధాని నిజామాబాద్ పర్యటనతో చర్చనీయాంశం
- 'మా బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించేదెప్పుడు' అంటూ ట్విట్టర్ వేదికగా ప్రధానికి మంత్రి కేటీఆర్ సూటి ప్రశ్న

బయ్యారం, అక్టోబర్3: బయ్యారం ఉక్కు పరిశ్రమకు ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం ఉరివేసిందా..? అనే సందేహాలు తెలంగాణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఆర్టికల్ 13లో రూ. 30 వేల కోట్లతో సెయిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ పరిశ్రమ నిర్మించేలా బిల్లులో పొందుపరిచారు. అయినా కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేండ్లు గడిచినప్పటికీ ఉక్కు పరిశ్రమ విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రధాన మంత్రి మోదీ అనేక సార్లు రాష్ట్రంలో పర్యటించారు. ఒక్కసారి కూడా బయ్యారం ఉక్కు పరిశ్రమ హామీ అంశంపై నోరు మెదపలేదు. మూడు రోజుల క్రితం మహబూబ్‌నగర్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ రాష్ట్రంలోని అనేక అంశాల గురించి ప్రస్తావించినప్పటికీ స్టీల్ ప్లాంట్ అంశాన్ని మాత్రం ప్రస్తావించలేదు. అదేవిధంగా మంగళవారం నిజామాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని బయ్యారం అంశాన్ని ప్రస్తావిస్తారని తెలంగాణ ప్రజానీకం ఆశగా ఎదురుచూసినా నిరాశే మిగిలింది. తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిలువనున్న బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని రాష్ట్ర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సైతం ట్విట్టర్ వేదిక ద్వారా ప్రధానమంత్రికి ప్రశ్నలు సంధించారు. 'మా కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీకి ప్రాణం పోసెదెప్పుడు? బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించేదెప్పుడు? పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా దక్కేదెప్పుడు? అని సూటిగా ప్రధానిని ప్రశ్నించారు. అంతేకాకుండా పదేండ్ల నుంచి పాతరేసి ఎంతకాలం అబద్ధాల జాతర? అని మండిపడ్డారు. 'మోదీ మీ మనసు కరిగేదెప్పుడు? తెలంగాణ గోస తీరెదెప్పుడు? గుండెల్లో గుజరాత్ పెట్టుకొని తెలంగాణ గుండెల్లో గునపాలా?, కోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు కర్మాగారం ఊపిరి తీశారు?, లక్షల ఉద్యోగాలిచ్చే ఐటీ ఐఆర్‌ని ఆగం చేశారు?, తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా హామీని తుంగలో తొక్కారు? అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అయితే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూనే ఉంది. అనేక సార్లు కేంద్రానికి మొర పెట్టకున్నా కనికరించలేదు. ప్రధాని నిజామాబాద్ పర్యటన వేళ మరో మారు బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశం తీవ్ర చర్చనీయంగా మారింది.

ఖనిజం లేని చోట ఉక్కు ఫ్యాక్టరీ

కేంద్రప్రభుత్వం ఇనుప ఖనిజం ఉన్న చోట ఫ్యాక్టరీ నిర్మించకుండా అది లేని చోట ఫ్యాక్టరీ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తూ తెలంగాణ పట్ల వివక్షను చూపిస్తోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో 1,41,691 ఎకరాల్లో(5690 హెక్టార్ల) ఇనుప ఖనిజం ఉండగా మానుకోట జిల్లాలోని బయ్యారం, గార్ల, గూడూరు మండలాల్లో సుమారు 44 వేల హెక్టర్లలో ఇనుప ఖనిజం ఉంది. కాగా బయ్యారం మండలంలోని ఇర్సులాపురం, రామచంద్రాపురం, మొట్లతిమ్మపురం, చింతోని గుంపు అటవీ ప్రాంతంలోని 25, 700 హెక్టర్లలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం ఉందని గతంలో అనేక సర్వే సంస్థల అధికారులు తేల్చారు. 80 శాతం ఇనుప ఖనిజం బయ్యారం పరిసర ప్రాంతాల్లో ఉండగా, ఇక్కడ 60 నుంచి 70 శాతం నాణ్యత కలిగి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం బయ్యారంలో నాణ్యత కలిగిన ఉక్కు లేదని ఆసత్య ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బైలడిల్లా గనులను బయ్యారానికి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్రం పట్టించుకోకుండా, గనులు లేని ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు తరలించేందుకు పూనుకుంది. అంతే కాకుండా ప్రధానికి అత్యంత ఆప్తుడైన ఆదానీకి బైలడిల్లా గనులు కేటాయించి అక్కడే స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఇనుప ఖనిజం ఉన్న బైలడిల్లా ప్రాంతం బయ్యారానికి 180 కిలోమీటర్లు మాత్రమే. కానీ కేంద్రప్రభుత్వం 1800 కిలోమీటర్ల దూరంలోని గుజరాత్ రాష్ట్రంలోని ముంద్రాకు తరలించేందుకు సన్నాహాలు చేస్తూ బయ్యారాన్ని బలి చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేటీఆర్ పర్యటనకు పకడ్బందీగా పోలీసు బందోబస్తు

- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

సుబేదారి, అక్టోబర్3: మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 6న వరంగల్ నగర పర్యటనకు వస్తున్న సందర్భంగా పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పోలీసు బందోబస్తు ఏర్పాట్లకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంత్రి నగరంలో పర్యటించనున్న ప్రాంతాలను సీపీ, ఇతర పోలీసు అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. కాకతీయ మెడికల్ కళాశాలలో హెలిప్యాడ్ నిర్మాణ స్థలం, రంగంపేటలో నూతనంగా నిర్మించిన పోలీసు భరోసా కేంద్రం భవనం, చింతల్ బహిరంగ సభ స్థలాలను సీపీ పరిశీలించారు. మంత్రి ప్రయాణించే మార్గాల్లో ఎక్కడా భద్రతా లోపాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చింతల్ సభ స్థల మ్యాప్‌ను పరిశీలించి, సభకు ప్రజలు వచ్చే మార్గాలను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. సీపీ వెంట క్రైమ్స్ డీసీపీ మురళీధర్, సెంట్రల్ జోన్ డీసీపీ బారి, అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ బోజ రాజు, క్రైమ్స్ ఏసీపీ మల్లయ్య, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఇన్‌స్పెక్టర్లు వెంక టేశ్వర్లు, సువర్ణ, సంజీవ్, వెంకన్న, శ్రీనివాస్ ఉన్నారు.

సభా స్థలి మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

సైఫ్ సస్పెన్షన్ తాత్కాలికంగా నిలిపివేత

కేఎంసీ పీజీ విద్యార్థిని మృతి కేసులో నిందితుడికి ఊరట

తరగతుల హాజరుకు అనుమతిచ్చిన కోర్టు

వరంగల్ చౌరస్తా, అక్టోబర్3: కేఎంసీ అనస్థీషియా పీజీ ఫస్టియర్ విద్యార్థి ధరా వత్ ప్రీతి మృతి కేసులో నిందితుడు సైఫ్ సస్పెన్షన్‌ను కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు తరగతులకు హాజరు కావడానికి అనుమతించింది. 2023 ఫిబ్రవరి 22వ తేదీన ప్రీతి ఆత్మహత్యాయత్నం, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనలో కేఎంసీ ప్రిన్సిపాల్ అధ్యక్షతన మార్చి 1న యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో నిందితుడిపై చర్యలకు తీర్మానిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)లకు నివేదిక అందజేసి, సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల పోలీసులు నిందితుడిపై కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించిన సమయంలో నిందితుడిని విచారించకుండానే యాంటీ ర్యాగింగ్ కమిటీ ఏడాది పాటు సస్పెండ్ చేయడం సరైందికాదని అతడి తరపు న్యాయవాది పేర్కొనడంతో కోర్టు కమిటీ తీర్మానాన్ని తప్పుబట్టింది. ఆ వ్యక్తి వివరణను పరిగణలోకి తీసుకో కుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరైందికాదని, విచారణ తిరిగి జరపాలని కేఎంసీ వైద్యాధికారులతోపాటు యాంటీ ర్యాగింగ్ కమిటీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో సైఫ్ సస్పెన్షన్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ, తరగతులకు హాజరు కావడానికి అవకాశాన్ని కల్పించింది. వారం రోజుల అనంతరం తిరిగి యాంటీ ర్యాగింగ్ కమిటీ పునఃవిచారణ జరిపి తీర్మానాన్ని కోర్టుకు సమర్పిస్తామని కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ తెలిపారు.

నేటి నుంచి క్రీడల ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 2: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అండర్ 19 బాలబాలికలకు 67 ఎస్‌జీఎఫ్ఐ క్రీడలకు డిస్ట్రిక్ట్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ బరుపాటి గోపి, జాయింట్ సెక్రటరీ కే సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిడెడ్, ట్రైబల్, సోషల్, బీసీ వెల్ఫేర్, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, టీఎస్ ఆర్‌జేసీ, మోడల్ జూనియర్ కాలేజీలు, మహాత్మాజ్యోతిరావు పూలే, మైనార్టీ, కేజీబీవీ, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న వారికి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 4న ఉదయం 8 గంటలకు లాల్‌బహదూర్ కాలేజీలో కబడ్డీ, త్రోబాల్, యోగా, టెన్నిస్, వాలీబాల్, చెస్, టేబుల్ టెన్నిస్, పుట్సల్, థాంగ్ టా మార్షల్ ఆర్ట్, టెన్నిస్ బాల్ క్రికెట్, థాయిబాక్సింగ్, కర్ఫ్‌బాల్, ఫ్లోర్‌బాల్, తదితర క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, కాలేజీ గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

దేవాదాయశాఖ నిబంధనలు పాటించాలి

వరంగల్ జోన్ ఉప కమిషనర్ టీ శ్రీకాంతారావు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 3: అర్చకులు నిబంధనలను అనుసరించి, కోడ్ ఆఫ్ కండక్ట్‌ను వినియోగిస్తూ ఆల యాల్లో పూజలు నిర్వర్తించాలని దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ టీ శ్రీకాంతారావు సూచించారు. హనుమకొండలోని టీటీడీలో జరుగుతున్న ధూప, దీప, నైవేద్య పునఃశ్చరణ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆగమ శాస్త్ర విరుద్ధంగా పూజలు చేయవద్దన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు వారివారి దేవాలయం నుంచి లొకేషన్ షేర్ చేయాలని చెప్పారు. సమావేశంలో అర్చక బోర్డు సభ్యుడు చిలకమర్రి శ్రావణ్‌కుమార్, సహాయ కమిషనర్ రాముల సునీత, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, భద్రకాళీ ఈవో శేషు భారతి, కాండూరి కృష్ణమాచారి, దేవాదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ వీరస్వామి, ఇన్‌స్పెక్టర్లు కవిత, సంజీవరెడ్డి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు. స్మార్త ఆగమ పండితులు జాగర్లపూడి రామశర్మ, లంకా శివకుమార్‌శర్మ, వేదాంతం పార్థసారథి ఆచార్యులు, తనుగుల రత్నాకర్, తంతసార ఆగమ రాఘవాచారి పండితులు శిక్షణ ఇచ్చారు. సుమారు 400 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ టీ శ్రీకాంతారావు, పక్కన గంగు ఉపేంద్రశర్మ